సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం । 27 । జూలై । 2023



పాపం..పసి వాళ్లు..!

కురబలకోట మండలం ఎర్రమద్దివారిపల్లెకాలనీలో ముగ్గురు పిల్లలు దిక్కులేని వారయ్యారు. ఇదివరకు తండ్రి, బుధవారం తల్లి మృతి చెందడంతో వారి జీవితం ప్రశ్నార్థకంగా మారింది. - 8లో



కేసుల సత్వర పరిష్కారానికి కృషి

కేసులను త్వరగా పరిష్కరించేందుకు ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కర్నూలు- కడప రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్ అన్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.1400	రూ.1680
రెండోరకం	రూ.1180	రూ.1380

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 361 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	462	473
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 370.00 కిలోలు

న్యూస్‌రీల్

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలతో చిన్నారులు, ఐటీబీపీ సిబ్బంది

సంబేపల్లె : మొక్కలతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతిఒక్కరూ మొక్కలు విరివిగా నాటాలని ఇండో టిబెటన్ బోర్డర్ పోలీసు(ఐటీబీపీ) కమాండెంట్ అమిత్‌భారియా అన్నారు. బుధవారం మండల పరిధిలోని గుట్టపల్లె అంకిరెడ్డిగారిపల్లె సచివాలయం ప్రాంగణంలో ఏపీ క్రియేటీవిటీ, కల్చరల్ అకాడమి బోర్డు మెంబర్ నిర్మలాదేవితో కలిసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ మొక్కలు పెంపకం వల్ల రేడియేషన్ తగ్గుతుందని. వర్షాలు బాగా కురుస్తాయన్నారు.

28న ఎక్సైజ్ వాహనాల వేలం

మదనపల్లె : మదనపల్లె స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) స్టేషన్ పరిధిలో గతంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాల్లో సీజ్‌చేసిన వాహనాలను శుక్రవారం బహిరంగ వేలం వేయనున్నట్లు సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. బుధవారం ఎస్ఈబీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో..శుక్రవారం ఉదయం 10 గంటలకు మదనపల్లె ఎస్ఈబీ స్టేషన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సమక్షంలో వేలంపాటలు జరుగుతాయన్నారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు రుసుం చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్‌ను 9440902595 నంబర్‌లో సంప్రదించాలని కోరగారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



కోటవారిపల్లెలో ఏఎన్‌ఎంలతో మాట్లాడుతున్న పీడీ ధనలక్ష్మి

మదనపల్లె : పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు తప్పనిసరిగా సంపూర్ణ పోషకాహారం అందించాలని ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి సూపర్‌వైజర్లు, వర్కర్లు, ఆయాలను ఆదేశించారు. బుధవారం ఐసీడీఎస్ సీడీపీఓ సుజాతతో కలిసి పీడీ మండలంలోని కోటవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు వ్యాధినిరోధక టీకాలుకు సంబంధించి ఏఎన్ఎం సుజాత, ఎంఎల్‌హెచ్‌ఓలు చేస్తున్న పరీక్షలను పరిశీలించారు. రిజిస్టర్లు తనిఖీ చేసి ప్రీ స్కూల్ హాజరు తక్కువగా ఉండటంపై సిబ్బందిని ప్రశ్నించారు. నాడు-నేడు పనులకు సంబంధించి స్కూల్ హెచ్‌ఎంలతో మాట్లాడి త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఆగస్టు 1 నుంచి ప్రతి కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు టీహెచ్‌ఆర్ పంపిణీ నిర్వహించాలన్నారు. అనంతరం కోటవారిపల్లె పంచాయతీ గ్రామసచివాలయాన్ని డీపీఓ ధనలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ పద్మకుమారి, సూపర్‌వైజర్ చంద్రకాంత, సూపర్‌వైజర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

వైవీయూ(వైఎస్సార్ జిల్లా) : కడప నగరం బాలాజీనగర్‌లోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో ఈనెల 28వ తేదీ శుక్రవారం 8.30 గంటల నుంచి మెగా గ్రాండ్ జాబ్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్, వైవీయూ పాలకమండలి సభ్యులు జి. సుబ్బారెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ కంపెనీల్లో దాదాపు 5వేల ఖాళీలకు సంబంధించి జాబ్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫ్రెష్, అనుభవం కలిగిన గ్రాడ్యుయేట్లు, పోస్టుగ్రాడ్యుయేట్లు, నాన్ గ్రాడ్యుయేట్లు సైతం నేరుగా జాబ్ ఫెయిర్‌కు హాజరుకావచ్చని తెలిపారు. ఈ జాబ్ ఫెయిర్‌ను వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

తహసీల్దార్ సస్పెన్షన్

వీరపునాయునిపల్లె : వైఎస్సార్ జిల్లా వీరపునాయునిపల్లె మండల తహసీల్దార్ రమేష్‌ను విధుల నుంచి తొలగిస్తూ కలెక్టరేట్ నుంచి ఉత్తర్వు లు జారీ అయ్యాయి. ఈయనతో పాటు టైపిస్ట్ అజయ్‌కుమార్‌ను కూడా విధుల నుంచి తొలగించారు. వీరు రైతుల భూములకు సంబంధించి కేవలం నెలరోజుల వ్యవధిలోనే 89 మ్యుటేషన్‌లు నిర్వహించారు. మ్యుటేషన్‌లు నిర్వహణలో అవతవకలకు పాల్పడినట్లు పలువురు రైతుల నుంచి ఆరోపణలు రావడంతో జిల్లా స్థాయి అధికారులు విచారణ చేపట్టారు. విచారణలో 38 మ్యుటేషన్‌లకు సంబంధించిన రికార్డులు కార్యాలయంలో అందుబాటులో లేనట్లు తేలింది. దీంతో వీరిద్దరిని విధుల నుంచి తొలగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

కబ్జా కిశోరం.. గురివింద సూత్రం

- అన్న పదవిని అడ్డుపెట్టుకుని అనుచరులతో ఆక్రమణలు
- టీడీపీ నేతల నుంచి కమీషన్లు దండుకున్న వైనం
- ఇవన్నీ మరచి ప్రభుత్వంపై విమర్శలా..



గూడరేవుపల్లె పరిధిలో టీడీపీ నేత చాపల సూరి అక్రమంగా నిర్మించిన ఇల్లు

పీలేరు : ప్రతి నిత్యం పీలేరులో పెద్ద ఎత్తున భూ ఆక్రమణలు జరుగుతున్నాయంటూ విమర్శలు గుప్పించే టీడీపీనేత నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి భూ ఆక్రమణకు ఆసలైన ఆద్యుడు. ఇతని అండదండలతో గతంలో తన అనుచరవర్గం భారీగా భూ ఆక్రమణలకు పాల్పడింది. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని వెంచర్లు వేసి జేబులు నింపుకున్నారు. పలువురు టీడీపీ నాయకులు ప్రభుత్వ స్థలంలో దర్జాగా నిర్మించుకున్న ఇళ్లు దర్శనమిస్తున్నాయి.ఇవేమీ పట్టనట్లు కిషోర్‌కుమార్‌రెడ్డి దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.

విచ్చలవిడిగా భూ ఆక్రమణలు

నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో కిషోర్‌కుమార్‌రెడ్డి అండదండలతో వారి అనుచరులు పీలేరు పట్టణానికి అన్ని వైపులా కోట్లు విలువ గల ప్రభుత్వ భూములు ఆక్రమించారు. వాటిని ఇళ్ల స్థలాల పేరిట విక్రయించి కోట్లాది రూపాయలు దండుకున్నారు. పీలేరు పట్టణం, బోడుమల్లువారిపల్లె, ముదుపులవేముల, గూడరేవుపల్లె, యర్రగుంటపల్లె, దొడ్డిపల్లె, వేపులబైలు పంచాయతీల్లో ప్రభుత్వ భూములు టీడీపీ నేతల దాటికి బావురమన్నాయి. అప్పట్లోనే పలుమార్లు భూ ఆక్రమణలపై విచారణ చేపట్టినా ప్రయోజనం లేకపోయింది. భవిష్యత్ అవసరాల కోసం కేటాయించిన భూములనూ వదల్లేదు.ఆక్రమిత భూముల్లో పెద్ద పెద్ద భవంతులు నిర్మించుకోవడం గమనార్హం.టీడీపీ నేతలు గూడరేవుపల్లె పరిధిలో సర్వే నంబరు 202/2లో సుమారు 3 ఎకరాల స్థలం ఆక్రమణలకు పాల్పడ్డారు. ఇందులో టీడీపీ నాయకులు చాపల సూరి డీకేటీ భూమిలో ఎలాంటి అనుమతి లేకుండా రెండంతస్తుల భవనం నిర్మించుకున్నాడు. పీలేరు పరిధిలోని సర్వే నంబరు 72లో 2.40 ఎకరాల స్థలాన్ని పూర్తిగా కిషోర్‌కుమార్‌రెడ్డి అనుచరులు స్వాహా చేశారు. కిషోర్‌కుమార్‌రెడ్డికి పీఏగా వ్యవహరించిన సత్య విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్నాడు. కిషోర్ అండదండలతో ఏపీఎం అశోక్‌రెడ్డి రెండు భవంతులు నిర్మించుకున్నాడు. బోడుమల్లువారిపల్లె పరిధిలోని సర్వే నంబరు 909/1లో 4.84 ఎకరాలు, 909/3లో 2.70 ఎకరాలు స్థలం ప్రభుత్వ ఉద్యోగుల పేరుతో కిషోర్ అనుచరులు వెంచర్లు వేసి పలు ప్లాట్లు విక్రయించాయి. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆ స్థలంలో ఇది ప్రభుత్వ భూమి అని రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

నిబంధనలకు వ్యతిరేకంగా...

పట్టణానికి అన్ని వైపులా రెండు కిలో మీటర్ల పరిధిలో ప్రభుత్వ భూములు పట్టాలు ఇవ్వడానికి లేదు. అయితే నిబంధనలు తుంగలో తొక్కి రెవెన్యూ అధికారులను బెదిరించి అక్రమమార్గంలో విలువైన భూములు సొంతం చేసుకున్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రులుగా ఉన్న కాలంలో టీడీపీ నేతలు డీకేటీ పట్టాలపై హైకోర్టులో స్టేలు తెచ్చుకోవడం గమనార్హం.

చర్యలు తప్పవు



ఆక్రమణకు గురైన స్థలాలు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

పీలేరు : భూ ఆక్రమణదారులపై కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. పీలేరు పట్టణ పరిసర ప్రాంతాల్లో భూ ఆక్రమణలపై అందిన ఫిర్యాదులతో బుధవారం జేసీ పలు ఆక్రమణ స్థలాలను పరిశీలించారు. గూడరేవుపల్లె పంచాయతీ సర్వే నంబరు 198లో ఆక్రమణ గురైన స్థలాన్ని పరిశీలించి ఇది ప్రభుత్వ భూమి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేపించారు. అలాగే సర్వే నంబరులో 202/4 అక్రమ నిర్మాణాలు జరిగినట్లు గుర్తించి ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశారు. బోడుమల్లువారిపల్లె పంచాయతీ 906/2 ఎన్‌టీఆర్ కాలనీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు పరిశీలించారు. సర్వే నంబరు 625లో ఆక్రమణకు గురైన చెరువు పొరంబోకు, 625లో వాగు పొరంబోకు స్థలాలను పరిశీలించారు. ఎర్రగుంటపల్లె పంచాయతీ సర్వే నంబరు 562/16లో గయాలు భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆక్రమణదారులు ఎంతటివారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు.

కమీషన్లు దండుకున్నాడు



నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి తన అన్న ముఖ్యమంత్రి పదవిని అడ్డుపెట్టుకుని పీలేరు పట్టణం చుట్టూ తన అనుచరులు భూ ఆక్రమణలకు పాల్పడ్డానికి ప్రోత్సహించారు. కోట్లాదిరూపాయల విలువైన భూములు టీడీపీ నేతల స్వాహా చేసి సొమ్ముచేసుకుంటే వారి నుంచి కిషోర్ కమీషన్లు దండుకున్నాడు.

– గుండ్లూరి జయరామచంద్రయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు.

ఆక్రమణల భూములు స్వాధీనం



గతంలో కిషోర్ అండదండలతో టీడీపీ నేతలు ఇష్టారాజ్యంగా ఆక్రమణలకు పాల్పడ్డారు. వారు ఆక్రమణకు పాల్పడి అధికార పార్టీపై ఆరోపణలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. వారు ఆక్రమించిన భూములను చాలా వరకు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక తిరిగి స్వాధీనం చేసుకుంది. ప్రభుత్వ భూములను పరిరక్షించడం జరిగింది.

– కాలనీ చిన్న, ఎస్టీ నాయకుడు, పీలేరు.

భూముల పరిరక్షణకు ఎంపీ చొరవ



పీలేరు పట్టణం చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం టీడీపీ నేతలు ఆక్రమించిన భూములు తిరిగి స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ఇది ఓర్వలేకనే కిషోర్‌కుమార్‌రెడ్డి పసలేని ఆరోపణలు చేస్తున్నారు.

– సుంకర చక్రధర్, విద్యార్థి నాయకులు, పీలేరు.

కిలో రూ.168

మదనపల్లె మార్కెట్‌లో టామాటాకు రికార్డుస్థాయి ధర

మదనపల్లె : మదనపల్లె మార్కెట్‌చరిత్రలో పాత రికార్డులన్నింటినీ బద్దలు కొడుతూ... బుధవారం మొదటిరకం టమాటా కిలో రూ.168 ధర పలికింది. 45 ఏళ్ల మార్కెట్‌కమిటీ చరిత్రలో ఈ ఏడాది పలికినంత ధరలు గతంలో ఎన్నడూ లేకపోవడం విశేషం. మదనపల్లె మార్కెట్‌కు బుధవారం రైతులు మొత్తం 361 మెట్రిక్‌టన్నుల టమాటాను తీసుకువస్తే....వాటిలో మొదటిరకం కిలో రూ.140-168 మధ్య, రెండోరకం కిలో రూ.118-138 వరకు వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేశారు. టమాటా ధరలు రోజురోజుకీ పైకి పోతుంటే...పంట పొలాల్లో మాత్రం దిగుబడులు తగ్గిపోతున్నాయి. మూడురోజులుగా వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం.. ముసురువాన, వాతావరణం తేమగా ఉండటంతో దిగుబడులు అంతంతమాత్రంగా ఉంటున్నాయి. దేశంలో టమాటా పండించే రాష్ట్రాల్లో వర్షాలు అధికం కావడం, పంట పండకపోవడం, కర్ణాటకలో ఆకుమచ్చ తెగులు, వైరస్ సోకడంతో దిగుబడులు పూర్తిగా పడిపోయాయి. దేశం మొత్తం మీద ప్రస్తుతం టమాటా మదనపల్లె, పలమనేరు, పుంగనూరు, గుర్రంకొండ, అంగళ్లు, ములకలచెరువు.. కర్ణాటకలోని కోలారు, వడ్డిపల్లె మార్కెట్లలో మాత్రమే లభ్యమవుతోంది. దేశవ్యాప్తంగా టమాటాకు ఉన్నటువంటి డిమాండ్ దృష్ట్యా ఢిల్లీ, పశ్చిమబెంగాల్, చత్తీస్‌గఢ్, మహారాష్ట్రకు చెందిన వ్యాపారులు ఈ ప్రాంతాల్లో మకాం వేసి అధిక ధరలకు టమాటాను కొనుగోలు చేస్తున్నారు. వచ్చిన సరుకు వచ్చినట్లే అధిక ధరలకు అమ్ముడవుతుండటంతో తీసుకొచ్చిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో మదనపల్లె మార్కెట్లో రైతుల నుంచి సగటున కిలో రూ.104 చొప్పున టమాటా కొనుగోలు చేసి రైతు బజార్లలో సబ్సిడీధరలకు కిలో రూ.50 చొప్పున విక్రయిస్తోంది. ప్రస్తుతం ఆకాశాన్నంటుతున్న టమాటా ధరలు మరో నెలవరకు ఇలాగే కొనసాగుతాయని, అప్పటికి మదనపల్లె మార్కెట్‌లో సీజన్ పూర్తయితే అనంతపురం, డోన్, గుత్తి మార్కెట్లలో సరుకు లభ్యత వస్తుందన్నారు.

జిల్లాలో జడివాన

- జిల్లా వ్యాప్తంగా కమ్ముకున్న మబ్బులు
- ఉదయం నుంచి రాత్రి వరకు కురుస్తూనే ఉన్న జల్లులు



సంబేపల్లెలో వర్షం పడుతున్న దృశ్యం

సాక్షి రాయచోటి : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఉదయం నుంచి వర్షం కురుస్తూనే ఉంది. వాతావరణంలో మార్పుల ఫలితంగా చలి తీవ్రత పెరిగింది. జిల్లా అంతటా జడివాన కురుస్తున్నప్పటికీ ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించలేదు. మరో మూడు రోజులపాటు వానలు కురవనున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల వారితోపాటు ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని అధికార యంత్రాంగం హెచ్చరిస్తోంది.

జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ వర్షం కురుస్తోంది. ఎక్కడికక్కడ అన్నిచోట్ల మబ్బులు కమ్ముకున్నాయి. రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం పడుతున్నా పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లెలో చిరుజల్లులు మాత్రమే కురిశాయి. తుపాను ప్రభావంతో తెరిపి లేకుండా జల్లులు పడుతుండడంతో అన్ని ప్రాంతాలు తడిసిముద్దయ్యాయి.

స్తంభించిన జనజీవనం

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న జల్లుల ధాటికి జన జీవనం స్తంభించిపోయింది. వర్షం ఎంతసేపటికీ ఆగకపోవడంతో బడుగు జీవులతోపాటు వివిధ పనుల నిమిత్తం బయటికి వచ్చి తడుస్తూనే తమ రోజువారి కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మొత్తం మీద మూడు రోజులుగా కురుస్తున్న వానలు జిల్లా వాసులను కొంతమేర ఇబ్బందులకు గురి చేశాయని ప్రజలు భావిస్తున్నారు.

రాజంపేటలో 38.2 మి.మీ వర్షం

రాజంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని రాజంపేటలో 38.2 మిల్లీమీటర్లు, చిట్వేలి లో 37.0 , నందలూరులో 29.4, పెనగలూరులో 18.6, కోడూరులో 12.2, పుల్లంపేటలో 11 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా పీలేరు డివిజన్ పరిధిలో కలికిరి 16.2 మిల్లీమీటర్ల వంతున వర్షం కురిసింది. మిగిలిన మండలాల్లో కూడా వర్షపు జల్లులు కురిసాయి.

గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : జగనన్న హౌసింగ్ లేఔట్‌లలో మౌలిక వసతులు కల్పించి ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై హౌసింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలను చేపడుతుందన్నారు. జిల్లాలోని ప్రతి లేఔట్‌కు నీటి సౌకర్యం, విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలన్నారు ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి అయ్యేలా చూడాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారితో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పర్యావరణ ప్రణాళికను సిద్ధం చేసే అంశంపై ముఖ్యమైన 12 శాఖల జిల్లా ఉన్నతాధికారులకు దిశా నిర్దేశం చేశారు. కొత్తగా ఏర్పాటైన అన్ని జిల్లాలకు జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు జిల్లా పర్యావరణ ప్రణాళికలను సిద్ధం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారు ఇచ్చిన నమూనా టెంప్లేట్‌లలో అవసరమైన సమాచారం.. ఘన వ్యర్థాల నిర్వహణ, ద్రవ వ్యర్థాల నిర్వహణ, శబ్దకాలుష్యం, తాగునీటి వనరుల కాలుష్యం, వాహన కాలుష్యం, ఆసుపత్రి వ్యర్థాల నిర్వహణ, మైనింగ్, అటవీశాఖ కార్యాకలాపాలపై నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నివేదికలు తయారు చేయాలి తెలిపారు. కడప ప్రాంతీయ కార్యాలయ పర్యావరణ ఇంజనీర్ ఎన్ అశోక్ కుమార్, సహాయ పర్యావరణ ఇంజనీర్ అనీల్ కుమార్, డీఎంహెచ్‌ఓ కొండయ్య పాల్గొన్నారు.

ఎంపీ లాడ్స్ రూ. 10.69 కోట్లతో ప్రాధాన్యత పనులను పూర్తి చేయాలి

అన్నమయ్య జిల్లాలో ఎంపీ లాడ్స్ నిధులు రూ. 10.69 కోట్లతో చేపట్టిన ప్రాధాన్యత పనులను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. బుధవారం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన ప్రాధాన్యత పనులు ఎన్ని, ఎన్ని పూర్తి చేశారు, ఇంకా పూర్తి చేయాల్సినవి ఎన్ని అనే విషయాలపై కూలంకుశంగా చర్చించారు. నూతనంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లా అభివృద్ధికి ఎంపీ మిథున్ రెడ్డి ఎంపీ లాడ్స్ నిధులను కేటాయించినట్లు చెప్పారు ఈ మేరకు రూ. 10.69 కోట్లతో 274 పనులు చేపట్టడానికి అనుమతులు మంజూరయ్యాయన్నారు. ఇందులో ఇప్పటి వరకు రూ. 3.42 కోట్లు ఖర్చుచేసి 97 పనులను పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో సీపీఓ కృష్ణా నాయక్, ప్లానింగ్ శాఖ ఏడీ వెంకట్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యు ఎస్ఈ ప్రసన్న కుమార్, ఈఈలు, జేఈలు తదితరులు పాల్గొన్నారు.

- జిల్లాలో నమోదైన జీరో డోర్ నంబర్ ఉన్న ఓట్లను పరిశీలించి త్వరగా సరిచేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పేర్కొన్నారు. బుధవారం తహసీల్దార్లు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ జూమ్ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న జీరో డోర్ నంబర్లు గల ఓటర్ల జాబితాను, ఒక డోర్ నంబర్‌తో పది మంది కంటే ఎక్కువ ఉన్న ఓట్లను, 100 సంవత్సరాల పైబడి ఉన్న ఓటర్ల జాబితాను పరిశీలించి సరిచేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

కుప్పం పాపం.. బాబుదే!

- ఉపకాల్వ పనులు అటకెక్కించిన సీఎం రమేష్ సంస్థ
- 31 నెలలు గడువు పెంచినా పట్టించుకోలేదు
- పైగా రూ.144 కోట్లు అదనంగా దోచిపెట్టిన బాబు
- ఐదేళ్లలో నీళ్లు పారించలేకపోయి ప్రభుత్వంపై ఏడుపులు



టీడీపీ హయాంలో అసంపూర్తిగా మిగిలిన కుప్పం ఉపకాలువ పనులు (ఫైల్)

బి.కొత్తకోట : ఏవీఆర్ హంద్రీ-నీవా ప్రాజెక్టులో భాగమైన కుప్పం ఉపకాలువ పనులు చేపట్టిన టీడీపీ ఎంపీ (ప్రస్తుతం బీజేపీ) సీఎం రమేష్ కాంట్రాక్టు సంస్థ పనులు పూర్తి చేయకుండా టీడీపీ అధికారంలో ఉండగానే ఏడాదిన్నరకు పైగా పనులు నిలిపివేసింది. సీఎం హోదాలో కుప్పంలో పర్యటించిన ప్రతిసారి పనులపై ఆదేశాలివ్వడమేకాని కఠినచర్యలు తీసుకోకుండా కాంట్రాక్టు సంస్థ ఇష్టారాజ్యంగా వ్యవహరించేందుకు చంద్రబాబు ప్రభుత్వమే అవకాశం ఇచ్చింది. 31నెలలు కాంట్రాక్టు గడువును పెంచి సహకరించింది. ఇన్నిరకాలుగా సహకరించిన గత చంద్రబాబు ప్రభుత్వం ఒప్పందానికి మించి రూ.144 కోట్లను అదనంగా అడ్డంగా దోచిపెట్టింది. ఇవన్నీ విస్మరించిన మాజీ సీఎం, కుప్పం ఎమ్మెల్యే చంద్రబాబు బుధవారం మీడియా సమావేశంలో రాజకీయ కక్షతోనే కుప్పం నియోజకవర్గానికి నీళ్లు ఇవ్వలేదని, పనులు చేయలేదంటూ ప్రస్తుత ప్రభుత్వంపై నిందలేయడం విచిత్రంగా ఉందని పరిశీలకులు తప్పుబడుతున్నారు.

బాబు హయాంలోనే పనులకు గండం

కృష్ణా జలాలను కుప్పం నియోజకవర్గానికి తరలించేందుకు ఉద్దేశించిన హంద్రీ-నీవా ప్రాజెక్టు రెండోదశ డీపీఆర్‌లోనే కుప్పం ఉపకాలువ పనులను నిర్దేశించారు. అయితే 2015లో చిత్తూరుజిల్లా పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలంలోని అప్పినపల్లె చెరువు నుంచి కుప్పంలోని పరమసముద్రం చెరువు వరకు 143.9 కిలోమీటర్ల కాలువ పనులు, మూడు ఎత్తిపోతల పథకాలు, మధ్యలో కాంక్రీటు నిర్మాణాలు పూర్తి చేయడం కోసం గత టీడీపీ ప్రభుత్వంలో 2015లో రూ.413కోట్లతో టెండర్లు నిర్వహించగా 4శాతం ఎక్సెస్‌తో రూ.430.27 కోట్లకు టెండర్ వేసిన హెచ్ఈఎస్-ఆర్‌కే-కోయా జాయింట్ వెంచర్ పనులు దక్కించుకొంది. పనిచేపట్టాక అప్పటి టీడీపీ ఎంపీ సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ ప్రాజెక్ట్స్ కాంట్రాక్టు సంస్థకు పనుల్లో భాగస్వామ్యం కల్పిస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ పనులను 2016 జనవరి, 4 నుంచి మొదలుపెట్టి 2016 అక్టోబర్, 3 నాటికి పూర్తి చేయాలనేది కాంట్రాక్టు సంస్థతో ఒప్పందం. అయితే ఆ గడువుకు పనులు చేయకపోవడంపై చర్యలు తీసుకోవాల్సిన చంద్రబాబు ప్రభుత్వం కాంట్రాక్టు సంస్థను ఉపేక్షించడమే కాక వారికి అనుకూలంగా 2016 అక్టోబర్, 4వ తేదీ నుంచి 2019 ఏప్రిల్, 30 వరకు ఐదుసార్లు గడువు పెంచింది. అయినా పనులు పూర్తి చేయలేదు. కాగా, 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి రూ.85.05 కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. 2.175 కిలోమీటర్ల కాలువ, 103 స్ట్రక్చర్స్ నిర్మాణం, 5,95,325 క్యూబిక్ మీటర్ల మట్టిపని.. 42,182 క్యూబిక్ మీటర్ల కాంక్రీటు పనులు, గుడిపల్లె మండలంలో రైల్వే క్రాసింగ్ టన్నెల్ పనులు (45 మీటర్లు) చేయలేదు. ఈ పనులు పూర్తి చేయాలని పదిసార్లకు పైగా నోటీసులు జారీచేసినా కాంట్రాక్టు సంస్థ ఖాతరు చేయలేదు. దీంతో ఈ పనులు పూర్తి చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం కాంట్రాక్టు సంస్థను 60సీ కింద తప్పించాల్సి వచ్చింది.

రూ.144.7 కోట్లు దోచిపెట్టింది మరిచారా

గత టీడీపీ పాలనలో ఒప్పంద విలువ కంటే అదనంగా రూ.287 కోట్లు దోచుకోవాలని కాంట్రాక్టు సంస్థ పథకం వేసింది. అదనంగా మట్టి పనులు చేశామని రూ.160కోట్లు అదనంగా చెల్లించేలా అధికారులు చేసిన ప్రతిపాదనను గత టీడీపీ పాలనలోనే స్టేట్‌లెవల్ స్టాండింగ్ కమిటీ అదనపు చెల్లింపు కుదరదని తిరస్కరించగా అందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. కాంక్రీటు నిర్మాణాలకు మాత్రమే అదనంగా చెల్లిస్తామని ఎస్ఎల్ఎస్‌సీ నిర్ణయం తీసుకోగా రూ.122.75 కోట్లు మంజూరు చేస్తూ 2018 సెప్టెంబర్, 7న జీవో నంబర్ 626 జారీ చేసింది. కుప్పం కాలువ పనిలో కాలువ గట్లమీద మట్టిపనులు చేశారని 2019 జనవరి, 28న జీవో 68 జారీచేసి రూ.21.95 కోట్లు అదనంగా మంజూరు చేసింది. దీనితో గత టీడీపీ సర్కార్ కాంట్రాక్టు సంస్థకు అడ్డంగా అదనంగా రూ.144.7 కోట్లు దోచిపెట్టింది. ఈ దోపిడీ కోసం ప్రత్యేకంగా జీవో నంబర్ 32 తీసుకొచ్చింది. దీనితో కుప్పం కాలువ పని విలువ రూ.574.96 కోట్లకు చేరింది.

మమ అనిపించారు

ఎన్నికల కోసం 2019 జనవరి, 21 నుంచి ఏప్రిల్ 11 వరకు కృష్ణా జలాలను ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పెద్దతిప్పసముద్రం మండలం నుంచి ప్రారంభమయ్యే పుంగనూరు ఉపకాలువలోకి కృష్ణా జలాలను పారించి మమ అనిపించారు. ఈ 82 రోజుల్లో మొక్కుబడిగా తరలించింది 775 ఎంసీఎఫ్‌టీలు(మిలియన్ క్యూబిక్ ఫీట్స్). అంటే ఒక టీఎంసీ నీటికి 225 ఎంసీఎఫ్‌టీలు తక్కువ. ఈ నీటిలో 207 కిలోమీటర్ల పొడవుకల పుంగనూరు ఉపకాలువ (గడ్డంవారిపల్లె నుంచి బొమ్మరాజుపల్లె వరకు)లో 742.19 ఎంసీఎఫ్‌టీలు, కుప్పం కాలువలో 32.81 ఎంసీఎఫ్‌టీల నీరు పారింది. పలమనేరు నియోజకవర్గంలోని అప్పినపల్లె నుంచి 43వ కిలోమీటరులోని వి.కోట మండలం నార్నిపల్లె వరకు జలాలు సాగి ఆగిపోయాయి. కుప్పం నియోజకవర్గంలోకి చుక్కనీటిని పారించలేకపోయారు. ఇలా గత టీడీపీ హయాంలో అన్ని విధాలా చోటుచేసుకున్న వైఫల్యాలను, నిర్లక్ష్యాన్ని కప్పి పుచ్చుకున్న చంద్రబాబు, కుప్పం నియోజకవర్గంపై ప్రభుత్వం కక్ష సాధిస్తోందని, కృష్ణా జలాలు తరలించడం లేదని ఆరోపణలు చేయడం రాజకీయం కోసమేనని స్పష్టమవుతోంది.

వివాహిత అదృశ్యం


అశ్విని (ఫైల్)

పీలేరు : వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరసింహుడు తెలిపారు. స్థానిక యల్లమంద క్రాస్‌లో నివాసం ఉంటున్న వెంకటేశ్వరరెడ్డికి రెండేళ్ల క్రితం అశ్విని (22)తో వివాహమైంది. వీరికి ఒక కుమార్తె ఉంది. స్కూటర్ మెకానిక్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరరెడ్డి ఈనెల 19న తన షెడ్డుకు వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా భార్య, కుమార్తె కన్పించలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద గాలించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాపం.. పసి వాళ్లు..!

- నాడు తండ్రి..నేడు తల్లి మృతి
- గ్రామస్తుల సాయంతో అంత్యక్రియలు
- అనాథలైన ఈ బిడ్డలకు దిక్కెవరు?

కురబలకోట : కురబలకోట మండలం మట్లివారిపల్లె గ్రామం ఎర్రమద్దివారిపల్లెకాలనీలో ముగ్గురు పిల్లలు దిక్కులేని వారయ్యారు. ఇదివరకు తండ్రి, బుధవారం తల్లి మృతి చెందడంతో వారి ముగ్గురి బిడ్డల జీవితం ప్రశ్నార్థకంగా మారింది. వివరాలలోకి వెళితే...ఎర్ర మద్దివారిపల్లె కాలనీకి చెందిన పి. శంకర్, నాగవేణి దంపతులు కూలి పనుల ద్వారా జీవనం సాగించేవారు. ఉండేందుకు చిన్నపాటి ఇల్లు తప్ప ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. వీరికి శశికళ, నాగరాజు, లావణ్య ముగ్గురు పిల్లలు. ఆరేళ్ల క్రితం శంకర్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆ తర్వాత కుటుంబ భారం భార్య నాగవేణిపై పడింది. బిడ్డలకు పెద్ద దిక్కుగా ఉంటూ కూలి నాలి పనులతో ఉన్నంతలో ఆలనా పాలనా చూసేది. ఇలాంటి పరిస్థితిలో మరో సారి ఆ కుటుంబంపై విధి చిన్నచూపు చూసింది. ఆ బిడ్డల తల్లిని అనారోగ్యం వెంటాడింది. అసలే ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ఆమె సరైన ఆసుపత్రిలో వైద్యం కూడా చేయించుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో వ్యాధి ముదిరి బుధవారం ఉదయం తల్లి కూడా మృతి చెందింది. దీంతో ముగ్గురు బిడ్డలు అనాథలయ్యారు. వీరు తల్లి శవం వద్ద బోరున విలపిస్తుంటే చూసిన ప్రతి ఒక్కరి గుండె తరుక్కుపోయింది. పిల్లలకు పెదనాన్న, చిన్నాన్న ఉన్నా వారి పరిస్థితి అంతంత మాత్రమే. దీనికి తోడు పైగా ఇద్దరికీ పక్షవాతమే. ఎలాంటి పనులు చేయలేరు. మృతి చెందిన తల్లికి కూడా ఆ గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు ఆర్థిక సాయం చేయడంతో అంత్యక్రియలు నిర్వహించారంటే వీరిది ఎంతటి దయనీయ పరిస్థితో అర్థం చేసుకోవచ్చు. ఒకరి తర్వాత ఒకరుగా తల్లిదండ్రులు దూరం కావడంతో ఆ బిడ్డల పరిస్థితి చూసి అయ్యో.. పాపం.. పసివాళ్లు అంటూ సానుభూతి చూపుతున్నారు. వీరిలో పెద్ద కుమార్తె శశికళ ముదివేడు దగ్గరున్న కస్తూర్బా స్కూల్‌లో 8వ తరగతి చదువుతోంది. కుమారుడు నాగరాజు చేనేత నగర్‌లోని గురుకుల పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నాడు. ఆఖరు అమ్మాయి లావణ్య స్థానికంగా ఉన్న ప్రభుత్వ స్కూల్‌లో 5 వ తరగతి చదువుతోంది. చిన్న వయస్సులోనే తల్లిదండ్రులను కోల్పోయిన వీరిని ఆదుకునేందుకు అటు అధికారులు, ఇటు మానవతావాదులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.


ఎర్రమద్దివారిపల్లె కాలనీలో అనాథలైన ముగ్గురు పిల్లలు

ప్రభుత్వ భూమిని ఆక్రమించాడని ఫిర్యాదు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని పలుగురాళ్లపల్లె పంచాయతీ కొత్తపల్లె గ్రామ సమీపంలో కె. రమణారెడ్డి అనే వ్యక్తి 25 ఎకరాలు ప్రభుత్వ భూమిని ఆక్రమించాడని అదే గ్రామానికి చెందిన అన్నెం లక్ష్మీదేవి ఆరోపించారు. బుధవారం రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసిన అనంతరం ఫిర్యాదుదారురాలి భర్త వెంకటసుబ్బారెడ్డి మరి కొంతమంది రైతులు విలేకరులతో మాట్లాడుతూ కొత్తపల్లె సర్వేనెంబర్ 130 నుంచి 140 వరకు 8మంది రైతులకు పట్టా భూములు ఉన్నాయన్నారు. తమ భూములు దాటిన తరువాత ప్రభుత్వ భూములు ఉన్నాయన్నారు. రమణారెడ్డి కేవలం ఒకరి దగ్గర 5 ఎకరాలు డీకేటీ భూమిని కొనుగోలు చేసి సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని ఎలాంటి అనుమతులు లేకుండా ఆక్రమించుకున్నాడని తెలిపారు. భూమికి దారి కావాలని 40 అడుగుల వెడల్పుతో జేసీబీ ద్వారా రెండు రోజులుగా రాత్రిపూట రోడ్డు వేస్తున్నాడని పేర్కొన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి కృషి

- కర్నూలు–కడప రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్
- కడపలో డీఎస్పీ, ట్రాఫిక్, 'దిశ' పోలీస్ స్టేషన్‌ల తనిఖీ

కడప అర్బన్ : కేసులను త్వరగా పరిష్కరించేందుకు ఆయా పోలీసు కార్యాలయాల పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కర్నూలు– కడప రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన కడప నగరంలో పర్యటించారు. తొలుత పోలీస్ అతిథి గృహం నుంచి నేరుగా జిల్లా పోలీసు కార్యాలయం, 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌ను సందర్శించారు. తరువాత కడప డీఎస్పీ కార్యాలయం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, 'దిశ' మహిళా అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు.

■ కడప డీఎస్పీ కార్యాలయం తనిఖీ అనంతరం జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌తో కలిసి కడప సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి స్మగ్లింగ్‌పై నిఘా ఉంచి అరికట్టాలన్నారు. కడప డీఎస్పీ ఎం.డి. షరీఫ్, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

■ తరువాత కడప ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు భద్రతకు సంబంధించి ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. హెల్మెట్, సీటు బెల్ట్ ప్రాధాన్యతను వివరించాలన్నారు.

■ కడప నగరంలోని 'దిశ' మహిళా అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించి మాట్లాడుతూ మహిళల నేరాలకు సంబంధించి కేసులను త్వరితగతిన దర్యాప్తు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖలు మహిళల భద్రతే ప్రాధాన్యతగా పనిచేస్తున్నాయన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కేసులను పరిశీలించి పలు సూచనలు చేశారు. 'దిశ' యాప్‌ను మహిళలందరూ డౌన్‌లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప 'దిశ' మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ రమాకాంత్, సీఐ వినయ్‌కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కర్నూలు- కడప రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్, పక్కన ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

క్షతగాత్రులకు ప్రభుత్వ ఆర్థిక సాయం

రాజంపేట : కడప–రేణిగుంట జాతీయ రహదారిలోని చిన్నఓరంపాడు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అందజేశారు. బుధవారం మేడా భవన్‌లో ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధితులు ఉమర్‌హమీద్‌కు రూ.2లక్షలు, ఏనుగుల శంకరయ్యకు రూ.2లక్షలు ప్రభుత్వం నుంచి మంజూరైందన్నారు. ఆ చెక్కులను బాధితుల కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో రాజంపేట తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి (యువజనవిభాగం) తంబెళ్ల వేణుగోపాల్‌రెడ్డి, నందలూరు మండల నాయకుడు అన్నం నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీసీ బస్సు ప్రమాద బాధితులకు ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

బాడుగ ఇవ్వమంటే.. దాడి చేశారు


బాధితుడు వెంకటేశ్వరరెడ్డి

మదనపల్లె : బాడుగ డబ్బులు ఇవ్వమంటే, ఇవ్వకపోగా భార్యాభర్తలపై దాడి చేసి తీవ్రంగా గాయపరచిన సంఘటన బుధవారం సాయంత్రం మదనపల్లె మండలంలో జరిగింది. ఇసుకనూతపల్లెకు చెందిన కె.వెంకటేశ్వరరెడ్డి(36) స్థానికంగా ఫొటో స్టూడియో నిర్వహిస్తున్నాడు. తన ఇంటిలోని ఓ గదిని తన అక్క రత్నమ్మ కుమారుడైన పవన్‌కు అద్దెకు ఇచ్చాడు. అతను ఆ గదిలో చిల్లర అంగడి నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో వారి మధ్య విభేదాలు రావడంతో పది రోజుల క్రితం గది ఖాళీ చేశాడు. అయితే మూడు నెలల అద్దె ఇవ్వాల్సి ఉండటంతో వెంకటేశ్వరరెడ్డి అద్దె చెల్లించమని నిలదీశాడు. దీంతో పవన్ తన కుటుంబ సభ్యులతో కలిసి వెంకటేశ్వరరెడ్డి, అతని భార్య చిట్టెమ్మ(32)ల పై దాడి చేశారు. దాడిలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సాయంతో స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆహారశుద్ధి పరిశ్రమలకు ప్రభుత్వం చేయూత

పీలేరు : ఆహారశుద్ధి పరిశ్రమలకు ప్రభుత్వం చేయూతనిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో రాణించాలనుకునేవారికి సహకరిస్తోందన్నారు. 18 ఏళ్లు నిండిన పురుషులు, మహిళలు పరిశ్రమల స్థాపనకు ముందడుగు వేయాలన్నారు. బియ్యం పిండి, రైస్ బ్రాన్ ఆయిల్, న్యూడిల్స్, బియ్యంపిండి ప్యాకెట్స్, అప్పడాలు తయారీ, జ్యూస్ తయారీ, వేరుశెనగపప్పు, చాక్లెట్స్, అటుకులు, తదితర ఆహార ఉత్పత్తుల తయారీ పరిశ్రమలకు ప్రభుత్వం తోడ్పాటునిస్తుందని తెలిపారు. కేవీపల్లె, కలకడలకు మటన్ ప్రాసెసింగ్ యూనిట్, తంబళ్లపల్లెలో చింతపండు ప్రాసెసింగ్ యూనిట్, మొలకలచెరువుకు టమాట ప్రాసెసింగ్ యూనిట్, సుండుపల్లెలో మామిడి గుజ్జు పరిశ్రమల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజ, ఏపీఎం గంగరాజన్, రైతు సలహామండలి సభ్యులు బోదేషావలి, ఏరియా కోఆర్డినేటర్ రూతు, ఏపీఎం లక్ష్మణ్‌రెడ్డి, సీసీలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి

ఉచిత మెగా వైద్య శిబిరం

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని పెద్దకారంపల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో బుధవారం కారంపల్లి(మన్నూరు) సుబ్బారెడ్డి, మన్నూరు రామసుబ్బమ్మ జ్ఞాపకార్థం వారి వారసులు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. స్కాట్‌లాండ్‌లో వైద్య వృత్తిలో స్థిర పడిన మన్నూరు కుటుంబానికి చెందిన వైద్య నిపుణులు డాక్టర్ మన్నూరు కేశవరెడ్డి, డాక్టర్ కౌశల్యరెడ్డి, డాక్టర్ సోనియారెడ్డి నీమకళ్లు, డాక్టర్ సురేఖరెడ్డి నీమకళ్లు ప్రజలకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జునరెడ్డి పాల్గొని వైద్యులను సన్మానించారు. నిర్వాహకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మన్నూరు అశ్వత్థామరెడ్డి, మన్నూరు భాస్కర్‌రెడ్డిలు మాట్లాడుతూ వైద్య శిబిరంలో దాదాపు 400 మందికి పైగా వైద్య సేవలు అందించినట్లు తెలిపారు.


ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యల కారణంగా వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం కురబలకోట మండలంలో జరిగింది. అంగళ్లు పంచాయతీ దొమ్మన్నబాయికి చెందిన రమణ భార్య ఎస్.నీలారాణి(40) కుటుంబ సమస్యల కారణంగా ఇంట్లోనే పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకుంటోంది. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

సిద్దవటం : అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా జనార్దన్ అనే వ్యక్తిని అరెస్టు చేసి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సిద్దవటం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌బ్యూరో పోలీసు స్టేషన్ ఎస్‌ఐ పరుషోత్తం బాబు తెలిపారు. కొత్త మాధవరానికి చెందిన జనార్దన్ బుధవారం ముమ్మడిగుంటపల్లె క్రాస్ రోడ్డు వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా తాము గమనించి అరెస్టు చేశామన్నారు. అతని వద్ద ఉన్న 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామని పేర్కొన్నారు.

కడుపు నొప్పి తాళలేక మహిళ ఆత్మహత్య

లింగాల : లింగాల మండలం వెలిదండ్ల గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి కడుపు నొప్పి తాళలేక మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఏఎస్‌ఐ ప్రభాకర్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన గంగిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి భార్య గంగిరెడ్డి మమత (30) గత కొన్ని రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. మంగళవారం అర్ధరాత్రి కడుపు నొప్పి ఎక్కువ కావడంతో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

చిట్వేలిలో రెండు దుకాణాలలో చోరీ

చిట్వేలి : మండల కేంద్రమైన చిట్వేలిలో రెండు దుకాణాలలో మంగళవారం అర్ధరాత్రి చోరి జరిగింది. పోలీసుల కథనం మేరకు కొత్తబస్టాండ్‌లోని బుంగటవుల చంద్రబాబు చిల్లర దుకాణంలో రూ. 4వేలు, ఇంటూరి సురేష్ బాబు దుకాణంలో రూ. 8 వేలు నగదును దొంగలు ఎత్తుకెళ్లారు ఇనుపరాడ్లతో తాళం పగులగొట్టి దుండగులు చోరీకి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సుభాష్ చంద్రబోస్, సిబ్బంది, క్లూస్ టీమ్‌తో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

హార్సిలీహిల్స్‌పై బైక్ చోరీ

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై నిలిపి ఉంచిన బైక్ చోరీ కావడంపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రామమోహన్ బుధవారం తెలిపారు. మదనపల్లె రూరల్ మండలం కోటవారిపల్లె తాండాకు చెందిన రెడ్డెప్పనాయక్ మంగళవారం బైక్‌పై హార్సిలీహిల్స్ వచ్చాడు. బైక్‌ను ఎంట్రన్స్ వద్ద నిలిపి లాక్ చేసుకుని వెళ్లాడు. బుధవారం ఉదయం బైక్ కోసం వెళ్లగా కనిపించలేదు. దీంతో చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పిల్లల ఆహారం విషయంలో రాజీ పడొద్దు

లింగాల : పిల్లల ఆహారం విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న బాలయోగి ప్రతిభా గురుకుల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల హాస్టల్‌లోని వంట గదిని, నిత్యావసర సరుకుల నిల్వలను, విద్యార్థులకు అందించే మెను చార్ట్‌ను పరిశీలించారు. విద్యార్థులకు సిద్ధం చేసిన భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థుల భోజన విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థుల సమావేశం నిర్వహించి భోజన, తదితర వసతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో కేర్ టేకర్ మాధవీలత, సీనియర్ అసిస్టెంట్ సురేష్, పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొనారు.


కేర్ టేకర్ మాధవీలతతో మాట్లాడుతున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి

భారతి సిమెంట్‌తో నాణ్యమైన కట్టడాలు

సింహాద్రిపురం : భారతి సిమెంటుతో నాణ్యమైన కట్టడాలు నిర్మించవచ్చని భారతి సిమెంటు కంపెనీ సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ కిరణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి మండల కేంద్రమైన సింహాద్రిపురంలో భారతి సిమెంటు కంపెనీ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతి సిమెంటు అత్యాధునిక ప్రమాణాలు పాటించడం వలన నాణ్యమైన సిమెంటును అందిస్తోందన్నారు. తద్వారా తాపీ మేస్త్రీలు, వినియోగదారుల మన్ననలు పొంది నంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు. పీపీసీ వాడకం వల్ల కట్టడాలలో నాణ్యత పెరుగుతోందని.. నిపుణులచేత గుర్తింపు పొందిందన్నారు. జిల్లా సేల్స్‌మెన్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ భారతి సిమెంటు వాడకం వల్ల కలిగే లాభాలను వారికి తెలిపారు. అనంతరం తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్లు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో స్వరూప ఏజెన్సీ డీలర్ ఆర్. మల్లికార్జునరెడ్డి, సోమశేఖరరెడ్డి పాల్గొన్నారు.


తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్లు, బహుమతులను అందజేస్తున్న భారతి సిమెంటు కంపెనీ ప్రతినిధులు

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

రాయచోటిటౌన్ : హోం వర్క్ సరిగా చేయలేదని ఓ విద్యార్థిని చితకబాదిన సంఘటన రాయచోటి పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో బుధవారం చోటు చేసుకొంది. రాయచోటి పట్టణంలోని వేదవ్యాస పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న ఉస్మాన్ ఖాన్ హోం వర్క్ సరిగా రాయలేదని ఉపాధ్యాయుడు కర్రతో వీపుపై వాతలు వచ్చేలా కొట్టాడు. విషయం తెలుసుకున్ని విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు. జరిగిన సంఘటనపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని రాయచోటి ఎంఈఓ ఈశ్వర నాయక్‌ను డీఈఓ శ్రీరాం పురుషోత్తం ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



కడప అర్బన్ : కడప నగరంలోని కృష్ణ సర్కిల్ సమీపంలో ఈనెల 25వ తేదీ అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. ఎవరైనా ఆ మృతదేహం ఆచూకీ తెలిసిన వారు 91211 00510 నంబరులో సంప్రదించాలని ఒన్‌టౌన్ సీఐ నాగరాజు సూచించారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు..

ఖాజీపేట: ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తిని వేగంగా వస్తున్న కారు ఢీ కొనడంతో తీవ్రగాయాలయ్యాయి. భూమాయపల్లెకు చెందిన చెప్పలి బాబు అనే వ్యక్తి ఖాజీపేటలో తన పని ముగించుకుని ఇంటికి బయలు దేరాడు. బుడ్డాయపల్లె దగ్గర ఉన్న మోడల్ స్కూల్ వద్దకు రాగానే వేగంగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి.